సాక్షి
అనంతపురం
బుధవారం । 8 । అక్టోబర్ । 2025



టన్ను చీనీ రూ.15 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.8 వేల ధర పలికాయి.



కిలో టమాట రూ.22

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.3°/21.5°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లాకు 989 మెట్రిక్ టన్నుల యూరియా



యూరియా బస్తాలను పరిశీలిస్తున్న ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్

అనంతపురం అగ్రికల్చర్: 'స్పిక్' కంపెనీ నుంచి 988.875 మెట్రిక్ టన్నుల యూరియా మంగళవారం జిల్లాకు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా జిల్లాకు సరఫరా అయిన యూరియా బస్తాలను ఆయన పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు 649.98 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్‌కు, 338.895 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ డీలర్లకు కేటాయించి అక్కడి నుంచి ఇండెంట్ల మేరకు ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలు, రీటైల్ దుకాణాలకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

కాల్‌సెంటర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో శిక్షణ

అనంతపురం క్రైం: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కాల్‌సెంటర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గలవారు అర్హులన్నారు. అనంతపురం నగర శివారులోని టీటీడీసీ సెంటర్‌లో 90 రోజుల పాటు కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఉంటుందన్నారు. ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9492018354, 8639448535 నంబర్లకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

ఐసీడీఎస్ పీడీ నాగమణిపై సస్పెన్షన్ వేటు



అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.నాగమణిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శిశుగృహాలో ఆశ్రయం పొందుతున్న రెండు నెలల బాలుడు నిరూప్ ఈనెల 3న మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ అంశంపై నిర్లక్ష్యం వహించడంతో పాటు నివేదికను పై అధికారులకు అందించడంలో జాప్యం చేసిన కారణంగా సస్పెండ్ చేస్తున్నట్లు మహిళా,శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శిశుగృహ సిబ్బంది నిర్లక్ష్యం, అంతర్గత పోరు కారణంగా బిడ్డ మరణం సంభవించిందని, బిడ్డకు సరిగా ఆహారం ఇవ్వడంలో విఫలమైనట్లు గుర్తించామని తెలిపారు. బాలుడికి వైద్యపరంగా శిశుగృహ సిబ్బంది ద్వారా క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయించడంలో పీడీ విఫలమయ్యారని వివరించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్: సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు క్రమంలో ఏవైనా భూ సమస్యలు ఉంటే పరిష్కరించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోలార్ ప్రాజెక్టుకు భూ సేకరణపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, ఏపీఎస్‌జీఈఎల్ (ఎన్‌టీపీసీ) డెవలప్‌మెంట్ అధికారి కిషోర్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంబదూరు మండలం చెన్నంపల్లి వద్ద సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు 5,862 ఎకరాలు గుర్తించామన్నారు. అక్కడ ఏమైనా సమస్యలు ఉంటే నెల రోజుల్లో పరిష్కరించాలన్నారు. ఆర్డీఓ, సోలార్ ప్రాజెక్టు, నెడ్‌క్యాప్, సర్వే శాఖల అధికారులతో బృందం ఏర్పాటు చేసుకుని రెండు రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంత బాబు, సర్వే ఏడీ రూప్లానాయక్, ఎల్‌డీఎం నరేష్‌రెడ్డి, భూ విభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్, డీటీ సురేఖరావు, ఎన్‌టీపీసీ అధికారులు శివకుమార్, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నత్తే నయం



నత్తనడకన సాగుతున్న సర్జికల్ బ్లాక్ పనులు

ప్రజలకు మెరుగైన సేవలను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోంది. గత పాలకులకు పేరొస్తుందనే ఉద్దేశంతో కక్ష కట్టి కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. చంద్రబాబు సర్కారు రాజకీయ కక్షతో పేదలకు మాత్రం కష్టాలు తప్పడం లేదు.

- నత్తనడకన సర్జికల్, ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ నిర్మాణ పనులు
- పేదల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వంలో మంజూరు
- అప్పట్లోనే రూ.300 కోట్ల కేటాయింపు
- వచ్చీ రాగానే నిధులను కుదించిన చంద్రబాబు ప్రభుత్వం
- సర్కారు శాపంతో సా....గుతున్న పనులు
- రోగులకు తప్పని అవస్థలు

అనంతపురం మెడికల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో జిల్లాకు సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్స్, పీజీ హాస్టళ్లు మంజూరు అయ్యాయి. అప్పట్లోనే నాడు-నేడు కింద రూ.300 కోట్లు కేటాయించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా సకాలంలో పనులు పూర్తి చేయాలనే ఉద్దేశంతో వేగంగా చర్యలు తీసుకున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 8 విభాగాలకు సంబంధించి అత్యవసర సేవల్లో భాగంగా రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్ కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

కూటమి సర్కారు శాపం..

కూటమి ప్రభుత్వంలో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్, క్రిటికల్ కేర్, పీజీ హాస్టళ్ల నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. చంద్రబాబు సర్కారు వచ్చీ రాగానే నిధులను భారీగా కుదించింది. రూ.300 కోట్లను కేవలం రూ. 78 కోట్లకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఎంసీహెచ్ బ్లాక్ నిర్మించ తలపెట్టిన ఆర్అండ్‌బీ కార్యాలయ స్థలాన్ని ఇంత వరకు స్వాధీనం చేసుకోలేదంటే పేదల పట్ల చంద్రబాబు ప్రభుత్వానికి ఎంత చిన్నచూపో అర్థం చేసుకోవచ్చు. ఇక.. మిగిలిన భవన నిర్మాణ పనుల్లోనూ వేగం తగ్గింది. ప్రస్తుతం నత్తకంటే ఘోరంగా సాగుతున్నాయి. సర్కారు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఈ క్రమంలో సర్జికల్, పీజీ హాస్టల్, ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ బ్లాక్‌లకు మోక్షమెప్పుడు లభిస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే సర్వజనాస్పత్రికి రోగుల తాకిడి అధికమైన నేపథ్యంలో.. నేడు కూటమి సర్కారు శాపంతో బాలింతలు, గర్భిణులతో పాటు ఆస్పత్రిలో రోగులు నరకం చూడాల్సి వస్తోంది.

పీజీలకు తప్పని అవస్థలు..

అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ, మైక్రోబయాలజీ తదితర విభాగాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 117 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 92, మూడో సంవత్సరంలో 60 మంది కలుపుకుని మొత్తం 269 మంది పీజీ విద్యార్థులున్నారు. హాస్టల్ సదుపాయం లేకపోవడంతో వీరిలో చాలా మంది ఆస్పత్రి ఆవరణంలో ఉన్న సీనియర్ రెసిడెంట్ హాస్టల్‌లోనే అవస్థలు పడుతూ నెట్టుకొస్తుండగా.. చాలా మంది విద్యార్థులు అద్దె గదుల్లో ఉంటూ విద్యనభ్యసిస్తుండడం గమనార్హం.



మెడికల్ క్వార్టర్స్‌లో ఆగిపోయిన పీజీ హాస్టల్ భవన నిర్మాణ పనులు

అందుబాటులోకి వస్తే నాణ్యమైన వైద్యం..

ఆయా భవనాలు అందుబాటులోకి వస్తే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పేద ప్రజలకు మరింత నాణ్యమైన వైద్యం లభిస్తుంది. సర్జికల్ బ్లాక్ ఏర్పాటైతే నలుగురు ప్రొఫెసర్లు, పదుల సంఖ్యలో అసోసియేట్, అసిస్టెంట్, స్టాఫ్‌నర్సులు, క్లాస్ 4 సిబ్బంది, 200 పడకలు కూడా అందుబాటులోకి వస్తాయి. క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుతో న్యూరో సర్జరీ, కార్డియాలజీ, తదితర సేవలు రౌండ్ ద క్లాక్ పొందవచ్చు. దీంతో బెంగళూరు, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పనులను వేగంగా పూర్తి చేయాల్సిన కూటమి సర్కారు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సూపర్ స్పెషాలిటీ ఆవరణలో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ బ్లాక్

ఎఫ్‌పీఓలు రైతులకు మరింత చేరువ కావాలి

- జేడీ ఉమామహేశ్వరమ్మ



అధికారులతో సమావేశమైన జేడీఏ

అనంతపురం అగ్రికల్చర్: ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీఓ) ఆర్థికంగా బలోపేతమై రైతులకు మరిన్ని సేవలు అందించడానికి ముందుకు రావాలని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో అనుబంధ శాఖలు, ఎఫ్‌పీఓ ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. త్వరలో ఎఫ్‌పీఓల మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని, ఎఫ్‌పీఓల స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులు, వ్యాపార లావాదేవీలు, సభ్యులు, రైతులకు అందిస్తున్న వివిధ రకాల సేవలకు సంబంధించి రెండు మూడు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎఫ్‌పీఓలు ముందుకు వస్తే ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు విడుదల చేసే అవకాశం ఉన్నందున ఆర్థికంగా పరిపుష్టి సాధించేలా ప్రణాళిక రూపకల్పన చేస్తామన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఉద్యాన ఉత్పత్తులు, కూరగాయల అమ్మకాలు, చేపలు తదితర వాటికి సంబంధించి వ్యాపార లావాదేవీలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 118 వరకు ఎఫ్‌పీఓలు అధికారికంగా రిజిస్ట్రేషన్ అయినా అందులో చాలా వరకు ఎలాంటి కార్యకలాపాలు సాగించడం లేదన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎం అనురాధ, జిల్లా సహకార అధికారి అరుణకుమారి, ఏపీ సీడ్స్ డీఎం వెంకటసుబ్బయ్య, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, పశుశాఖ ఏడీ డాక్టర్ రాధిక, ఉద్యానశాఖ ఏడీ దేవానంద్, మార్కెటింగ్‌శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్, మత్స్యశాఖ ఎఫ్‌డీఓ ఆసిఫ్, టెక్నికల్ ఏఓలు రాకేష్ నాయక్, బాలానాయక్, కార్డు ప్రతినిధి నిర్మలా రెడ్డి, ఎకాలజీ సెంటర్ ప్రతినిధి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో మాయాజాలం



పామిడిలో కూలీల ఫొటోలను కొద్దిగా మార్చి వేర్వేరు పేర్లను నమోదు చేసిన దృశ్యాలు

- 10 మంది హాజరైతే 50 మంది వచ్చినట్లు చూపిన వైనం

పామిడి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో సిబ్బంది మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. జేబులు నింపుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఇష్టారాజ్యంగా కూలీలను నమోదు చేస్తూ డబ్బు వెనకేసుకుంటున్నారు. వివరాలు.. పామిడి గ్రామ పంచాయతీలో ఈ నెల 4న కేవలం 10 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారు. అయితే, కూలీలను నమోదు చేసే ఎన్‌ఎంఎంఎస్‌లో మాత్రం 50 మంది పనులకు వచ్చినట్లుగా నమోదు చేశారు. ఫొటోలు ఒకటే అయినా పేర్లు మాత్రం వేర్వేరుగా నమోదు చేసి అప్‌లోడ్ చేశారు. ఈ తంతు నిత్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా, ఎక్కడో ఒక లోపాన్ని కనుగొని మాయ చేస్తుండడంగమనార్హం. ఒక్క పామిడి పంచాయతీలోనే కాదు.. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఉపాధి సిబ్బంది ఇలాగే బురిడీ కొట్టిస్తూ, ప్రతి నెలా రూ. లక్షలు మింగేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా మండలాల అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే ఇలా జరుగుతోందని, జిల్లా స్థాయి అధికారులైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంగట్లో అంగన్‌వాడీ పోస్టులు

- ధర్మవరం నియోజకవర్గంలో ఓ వైపు బీజేపీ, మరో వైపు టీడీపీ నాయకులు అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఇప్పిస్తామంటూ వ్యాపారం మొదలు పెట్టారు. ఈ విషయంలో ముదిగుబ్బ మండలంలోని ఓ గ్రామంలో ఇరుపార్టీ నాయకుల మధ్య చిన్నపాటి గొడవ కూడా జరిగింది. మంత్రి సత్యకుమార్ ఇచ్చిన జాబితానే ఫైనల్ అని బీజేపీ నాయకులంటే.. కాదు కాదు పరిటాల ఫ్యామిలీదే జరుగుతుందని టీడీపీ వారు.. ఇలా ఇరువర్గాల వాదనలు రచ్చకెక్కాయి.

... ఇలా ఒకటి కాదు.. రెండు కాదు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ ఆయా పోస్టుల పేరుతో దందా మొదలైంది. ఆశావహులు పోస్టు కోసం డబ్బులివ్వక తప్పడం లేదు.

కదిరి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జిల్లాలో ప్రధానంగా టీడీపీ నాయకులు కొందరు రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఇది సక్రమ వ్యాపారమైతే పర్వాలేదు. అంతా అక్రమ వ్యాపారమే. ఇసుక, మట్టి, మద్యం ఇలా దేన్నీ వదలడం లేదు. తాజాగా కొత్త వ్యాపారం మొదలెట్టారు. అదే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల బిజినెస్. ఒక్కో పోస్టుకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల దాకా వసూలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఆ రేటు మరింత పెరిగే అవకాశం లేకపోలేదని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. జిల్లాలోని పలు మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఈ మధ్యే అప్‌గ్రేడ్ చేశారు. వీటికి ప్రస్తుతం ఒక్కొక్కరు చొప్పున అంగన్‌వాడీ సహాయకురాలు (ఆయా) అవసరం. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వం నుంచి అనుమతులు కూడా వచ్చాయి. దీనికి సంబంధించి రోస్టర్ ప్రక్రియ పూర్తి కాగానే కలెక్టర్లు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అయితే ఉమ్మడి జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో అంగన్‌వాడీ ఆయా పోస్టుల కోసం ఆశావహులు స్థానిక ఎమ్మెల్యేల ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీన్ని గ్రహించిన కొందరు ద్వితీయ శ్రేణి టీడీపీ నాయకులు 'ఆ పోస్టు ఎలాగైనా మీకే వచ్చేలా చేస్తాం. పోటీ ఎక్కువగా ఉంది. అయినా మీకే ఇప్పిస్తాం. కాకపోతే డబ్బులు ముందే ఇవ్వాలి. ఎన్నికల్లో డబ్బు తీసుకోకుండా ఓటు వేయలేదు కదా.. ఎంతో కొంత రాబట్టుకోవాలి..' అంటూ రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల దాకా వసూలు చేస్తున్నారు. సరాసరిన ఒక్కో పోస్టుకు రూ.3 లక్షలు అనుకున్నా రూ.16 కోట్లు పైమాటే. ఈ తంతు కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేకు తెలిసి జరుగుతుంటే.. ఇంకొన్నిచోట్ల ఆయా ఎమ్మెల్యే పీఏల కనుసన్నల్లో సాగుతోంది.



అప్‌గ్రేడ్ పేరుతో మరో వ్యాపారం

ఉమ్మడి జిల్లాలో ఉన్న పలు అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. వీటిలో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు 10వ తరగతి ఉత్తీర్ణత లేనందున ఆయా కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయలేదు. దీన్ని కూడా స్థానిక టీడీపీ నాయకులు కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అప్‌గ్రేడ్ చేయించి మిమ్మల్నే కొనసాగిస్తాం అంటూ కొందరు, ఆ స్థానంలో వారు కాకుండా మీకు అవకాశం కల్పించే బాధ్యత మాది.. అంటూ మరి కొందరు ఇలా వారిని నమ్మిస్తూ అంగన్‌వాడీ పోస్టును అంగట్లో అమ్మకానికి పెట్టారు. కొన్ని చోట్ల రూ.6 లక్షలు వరకు డిమాండ్ చేస్తున్నారని సమాచారం. అలాగే ఇవన్నీ అప్‌గ్రేడ్ అయితే ఆయా(సహాయకురాలు) పోస్టుకు ముందే డబ్బు కట్టి రిజర్వ్ చేసుకోండి.. అంటూ కొన్ని చోట్ల డబ్బు తీసుకున్నారు.

'డబ్బు'ల్ రిజిస్ట్రేషన్‌తో రూ.3 కోట్ల భూమికి ఎసరు!

- కనగానపల్లి మాజీ ఎంపీపీ భర్త ముకుందనాయుడి బరితెగింపు
- టీడీపీ ఎమ్మెల్యేల అండతో రెచ్చిపోతున్న వైనం



కబ్జా చేసిన స్థలంలో ముకుంద అనే పేరుతో బోర్డు నాటిన దృశ్యం



ఎమ్మెల్యే పరిటాల సునీతతో ముకుందనాయుడు

అనంతపురం టౌన్: అధికార అండతో 'పచ్చ' నేతలు బరితెగిస్తున్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని 'డబ్బు'ల్ రిజిస్ట్రేషన్లతో భయకంపితులను చేస్తున్నారు. కూటమి ఏడాదిన్నర పాలనలో అనంతపురం నగరం చుట్టూ ఇదే తంతు సాగుతోంది. ఇప్పటికే నగరంలో సాయినగర్‌లోని 'అస్రా' ఆప్టికల్స్ భవనంతో పాటు తపోవనంలోని ఎంకేఎం ఫంక్షన్ హాలు సమీపంలో 5వ రోడ్డులోని ఓ సామాజిక వర్గానికి చెందిన స్థలాల కబ్జా మరువక ముందే తాజాగా ఓ టీడీపీ నేత అనంత పురం రూరల్ మండలం ఏ. నారాయణపురం సమీపంలోని సర్వే నంబర్ 156–2లో రూ.3 కోట్ల విలువ చేసే 1.19 ఎకరాలకు ఎసరు పెట్టడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ సరిపూటి పద్మాగీత భర్త సరిపూటి ముకుందనాయుడు నడిపిన అడ్డగోలు బాగోతం కలకలం సృష్టిస్తోంది. వివరాలు.. ఏ. నారాయణపురం గ్రామానికి చెందిన పెద్ద నారప్పకు గ్రామ సర్వే నంబర్ 156–2లో 9.59 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని అతని వారసులు దశల వారీగా 1999లో 3 ఎకరాలు, 2002లో 2.40 ఎకరాలు, 2008లో మిగిలిన 5 ఎకరాలను విక్రయించేశారు. ఇదే సర్వే నంబర్‌లో 1999లో 3 ఎకరాలు కొనుగోలు చేసిన వ్యక్తి నుంచి ఒక ఎకరా స్థలాన్ని మూడో రోడ్డుకు చెందిన కవ్వలూరు కృష్ణ 2009లో కొనుగోలు చేశాడు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఈ భూమి విలువ రూ.3 కోట్లు పలుకుతోంది.

అధికార అండతో కబ్జా

కూటమి ప్రభుత్వం వచ్చాక కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పద్మాగీత, ఆమె భర్త ముకుందనాయుడు ఆ భూమిపై కన్నేశారు. టీడీపీ ప్రజాప్రతినిధుల అండతో 2025 ఆగస్టు 6న 'డబ్బు'ల్ రిజిస్ట్రేషన్ చేసుకుని భూమిలో బోర్డు నాటారు. ఇదేమని ప్రశ్నించిన నిజమైన భూయజమానులను వేధింపులకు గురిచేస్తున్నారు.

వారికి ప్రధాన అనుచరుడు..

కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన ముకుందనాయుడు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు ప్రధాన అనుచరుడు కావడం గమనార్హం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ముకుందనాయుడు అనంతపురానికి మకాం మార్చి నగర ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ తమకు సమీప బంధువు అంటూ హల్‌చల్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే మూడో రోడ్డుకు చెందిన కృష్ణ అనే బ్రాహ్మణుల ఎకరా భూమి కబ్జా చేయడం గమనార్హం. తమ పేర్లు చెప్పి కబ్జా చేస్తున్న విషయం ఆ ఎమ్మెల్యేలకు తెలుసా..? లేదంటే తెలిసి కూడా తెలియనట్లు వ్యవహరిస్తున్నారా అన్న విషయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

'డైట్' కళాశాలకు గ్రాంట్ విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: శ్రీసత్యసాయి జిల్లా డైట్ కళాశాలకు 2025–26 సంవత్సరానికి సంబంధించి గ్రాంట్ విడుదల చేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు పద్దుల కింద మొత్తం రూ.9. 90 లక్షలు విడుదల చేశామన్నారు. ఇందులో 50 శాతం వార్షిక గ్రాంట్ రూ. 7.50 లక్షలు, టెక్నాలజీ సపోర్ట్ కింద రూ. 2.40 లక్షలు ఉన్నాయన్నారు. నిబంధనలకు లోబడి ఖర్చు చేసి వివరాలను టీసీఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

ఘనంగా వాల్మీకి జయంతి




అనంతపురంలో వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ

జిల్లావ్యాప్తంగా మంగళవారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అధికారికంగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వాల్మీకి మహర్షికి ఘన నివాళులర్పించారు.

- వివరాలు 8లో

క్లుప్తంగా

నిండుకుండలా పీఏబీఆర్



జలాశయంలో 5 టీఎంసీల నీటి మట్టం

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) నిండుకుండలా దర్శనమిస్తోంది. మంగళవారం నాటికి 5.157 టీఎంసీలకు నీటిమట్టం చేరినట్లు డ్యాం డీఈ వెంకటరమణ తెలిపారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా 185 క్యూసెక్కులు, జీడిపల్లి జలాశయం నుంచి హంద్రీ-నీవా కాలువ ద్వారా 510 క్యూసెక్కుల చొప్పున నీరు వచ్చి చేరుతున్నట్లు వివరించారు. డ్యాంలో ఏర్పాటైన జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తికి 585 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు 55 క్యూసెక్కులు, లీకేజీ రూపంలో 35 క్యూసెక్కులు, నీటి ఆవిరి రూపంలో 25 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందన్నారు.

రసాయనిక ద్రావకం తాగి మేకల మృతి



మేకలను చూపుతున్న బాధితులు

పుట్లూరు: రసాయనిక ద్రావకం తాగి 20 మేకలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం కొండుగారి కుంట గ్రామానికి చెందిన రాజశేఖర్, బయన్న.. మేకల పోషణ ద్వారా జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం మేకలను మేపు కోసం సమీప పొలాల వద్దకు తీసుకెళ్లిన సమయంలో దాహం వేసి పండ్ల తోటలకు డ్రిప్పుల ద్వారా సరఫరా చేసేందుకు డ్రమ్ముల్లో ఉంచిన రసాయన ద్రావకాన్ని తాగాయి. అయితే మేకలు నీటిని తాగాయని భావించిన కాపరులు వాటిని సమీపం కొండల వద్దకు తోలుకెళుతుండగా ఒక్కొక్కటిగా 20 మేకలు మృతి చెందాయి. కాపరుల నుంచి సమాచారం అందుకున్న పశువైద్యాధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మేకల కళేబరాలకు ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి నాగసువర్ణ పోస్టుమార్టం నిర్వహించి, నివేదిక సిద్ధం చేశారు.

మసిపూసి.. మారేడు కాయ చేసి!

- శిశు మరణంపై సాక్ష్యాలు తారుమారు?
- ఇప్పటి వరకూ బయటపెట్టని సీసీ కెమెరా ఫుటేజీలు
- గతంలోనూ ఇదే తరహాలో కీలక ఫైళ్ల మాయం



అనంతపురం సెంట్రల్: మహిళాశిశు సంక్షేమశాఖ పరిధిలోని శిశుగృహ అవినీతికి కేరాఫ్‌గా మారింది. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది అక్రమాలకు పాల్పడడమే కాకుండా సాక్ష్యాలను సైతం తారుమారు చేయడంలో సిద్ధహస్తులనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. తాజాగా నవజాత శిశువు మృతి విషయంలోనూ సాక్ష్యాలు తారుమారు చేస్తున్నట్లు మహిళాశిశు సంక్షేమ శాఖలోని కొందరు అధికారులే బహిరంగంగానే పేర్కొంటున్నారు. శిశువు మృతి చెందిన రోజు ఏం జరిగిందనే విషయంపై సీసీ కెమెరా ఫుటేజీలు నేటికీ బయటపెట్టక పోవడమే ఇందుకు నిదర్శనమంటున్నారు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని ఒకసారి.. రికార్డు కావడం లేదని మరోసారి పొంతనలేని సమాధానాలతో విచారణాధికారులను సైతం పక్కదోవ పట్టించడం అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 3న శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఆస్పత్రికి తీసుకెళ్లామని, అక్కడ శిశువు మృతి చెందినట్లుగా సిబ్బంది బుకాయిస్తున్నారు. వాస్తవానికి శిశుగృహలోనే శిశువు మృతి చెందాడని, ఈ విషయం తెలిస్తే ఇబ్బందులు తప్పవని భావించిన శిశుగృహ సిబ్బంది సీసీ కెమెరా ఫుటేజీలను బయటపెట్టకుండా విచారణాధికారులను పెడదోవ పట్టిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గతంలోనూ తిమ్మిని బమ్మిని చేసి..

గతంలోనూ దత్తత అంశంలో తలెత్తిన వివాదంలో సాక్ష్యాలను తారుమారు చేసినట్లుగా శిశుగృహ సిబ్బందిపై ఆరోపణలున్నాయి. కెనడా దేశానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ మహిళ దత్తత కోసం రాగా ఆమె నుంచి తొలుత రూ. 3 లక్షలు... ఆ తర్వాత బంగారాన్ని డిమాండ్ చేయడాన్ని ఆక్షేపిస్తూ కేంద్ర రాయబార కార్యాలయానికి ఆమె లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అప్పటి జిల్లా కలెక్టర్ వీరపాండియన్ తక్షణ విచారణ చేపట్టి వాస్తవాలు నిర్ధారించుకున్న అనంతరం శిశుగృహ మేనేజర్‌ను విధుల నుంచి తొలగించారు. అయితే సదరు ఎన్‌ఆర్‌ఐ మహిళ ఫిర్యాదులను, కలెక్టర్ జారీ చేసిన టెర్మినేట్ ఉత్తర్వులకు సంబంధించిన ఫైల్స్‌లో కొన్ని మాత్రమే ఉంచి కీలకమైన సమాచారాన్ని మాయం చేశారు. ఫలితంగా కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో తిరిగి మళ్లీ అదే స్థానానికి మేనేజర్ చేరుకున్నారు. ఎన్‌ఆర్‌ఐ ఫిర్యాదుతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం వెంటనే సెంట్రల్ అడాప్షన్ రిసోర్సు అథారిటీ(కారా) వెబ్‌సైట్ ద్వారా దత్తత పొందేలా మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేసింది. అంతకు మునుపు ఆఫ్‌లైన్ విధానంలో ఇష్టానుసారంగా దత్తతకు ఇచ్చి భారీగానే సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

శిశుగృహ మేనేజర్ ఏం చేస్తున్నట్లు?

శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న చిన్నారుల సంరక్షణ బాధ్యత మొత్తం సంబంధిత మేనేజర్‌పైనే ఉంటుంది. ఇబ్బందికర పరిస్థితుల్లోనైనా 24 గంటలూ సేవలందించాల్సి ఉంటుంది. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వాసుపత్రిలో చిన్నపిల్లల వైద్యులతో చికిత్సను అందించాలి. అవసరమైతే అక్కడే అడ్మిట్ చేయడం.. ప్రత్యేకంగా ఆయాను నియమించి కోలుకునేంత వరకూ చికిత్సనందించేలా చర్యలు తీసుకోవాలి. ఇందుకు విరుద్ధంగా ఇటీవల శిశువు మృతి చెందే వరకూ కూడా మేనేజర్ పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. 3న అర్ధరాత్రి విధుల్లో ఉన్న ఒకే ఆయా శిశువు పరిస్థితిని ఫోన్ ద్వారా తెలిపినా మేనేజర్ స్పందించలేదని తెలిసింది. దీంతో ఐదుగురు చిన్నారులను వదిలేసి శిశువును తీసుకుని సర్వజనాస్పత్రికి ఆయా ఒక్కరే వెళ్లింది. అప్పటికే శిశువు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించి వెనక్కు పంపినట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

రంగంలోకి అసిస్టెంట్ కలెక్టర్

అనంతపురం మెడికల్: శిశుగృహ నుంచి అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన పసికందును ఎందుకు అడ్మిట్ చేయలేదని పీడియాట్రీషియన్ డాక్టర్ బాబ్జాన్‌ను అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ ఆరా తీశారు. శిశుగృహలో పసికందు మృతిపై విచారణలో భాగంగా శిశువుకు అందించిన వైద్యంపై అసిస్టెంట్ కలెక్టర్ మంగళవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో పీడియాట్రీషియన్లు డాక్టర్ బాబ్జాన్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ లోక్‌నాథ్‌తో విచారణ చేపట్టారు. శిశువుకు ఒకసారి మాత్రమే విరేచనాలయ్యాయని సిబ్బంది చెప్పారని, దీంతో అడ్మిట్ చేయలేదని డాక్టర్ బాబ్జాన్ తెలిపారు. ఒక్కసారి విరేచనమైనంతనే మరణించే అవకాశాలు ఎంత వరకు ఉంటాయనే అంశంపై అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ లోతైన విచారణ చేపట్టినట్లు సమాచారం.

అక్రమాలకు అధికారి అండ!

శిశువు మరణానికి బాధ్యులైన వారిని రక్షించేందుకు ఓ అధికారి విశ్వప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. గతంలో అక్రమాలకు పాల్పడి టెర్మినేట్ అయిన సమయంలో అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి తిరిగి శిశుగృహలో బాధ్యతలు స్వీకరించేలా చేసిన సదరు అధికారి ప్రస్తుతం కూడా అవినీతి అధికారిని రక్షించే బాధ్యతలను భుజాన వేసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా శిశువు శిశుగృహలోనే మృతి చెందిన అంశాలున్న సీసీ కెమెరా ఫుటేజీలను తొక్కి పెట్టించినట్లు ఆరోపణలున్నాయి. అనారోగ్యంతో శిశువు మృతి చెందినట్లుగా మెడికల్ సర్టిఫికెట్ సృష్టించే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

'కరివేపాకు'పై ఉద్యాన కమిషనర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి రూరల్: జిల్లాలో కరివేపాకు పంట సాగుపై రాష్ట్ర ఉద్యాన కమిషనర్ శ్రీనివాసులు ఆరా తీశారు. 'ఫ్యాక్షన్ గతిని మార్చిన కరివేపాకు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో వెలువడిన కథనం తెలిసిందే. దీనిపై స్పందించిన కమిషనర్.. మంగళవారం ఉదయం జిల్లా ఉద్యానాధికారి ఉమాదేవికి ఫోన్ చేసి సమగ్ర వివరాలను అందించాలని ఆదేశించారు. దీంతో కరివేపాకు పంట సాగుపై పూర్తి వివరాలు, రైతుల విజయాలపై పూర్తి స్థాయి సమాచారం సేకరించి ఇవ్వాలంటూ తాడిపత్రి ఉద్యాన అధికారి ఉమాదేవికి డీహెచ్‌ఓ సూచనలు జారీ చేశారు. దీంతో వివరాల సేకరణలో తాడిపత్రి ఉద్యాన అధికారి నిమగ్నమయ్యారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాన్ని కరివేపాకు పంట సాగు మార్చిన తీరుపై ఇతర ప్రాంతాల్లోని రైతులకు మార్గదర్శకంగా ఉండేలా ఓ డాక్యుమెంటరీని తీయనున్నట్లు సమాచారం.

గ్రామాల్లో జెడ్పీ సీఈఓ పర్యటన



నేమకల్లులో సీసీ రోడ్లను పరిశీలిస్తున్న సీఈఓ శివశంకర్

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు, నేమకల్లు గ్రామాల్లో జెడ్పీ సీఈఓ శివశంకర్ మంగళవారం పర్యటించారు. ఉంతకల్లులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ చేపట్టాల్సిన కార్యాచరణపై పలు సూచనలు చేశారు. గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణ విధానాన్ని నేరుగా ప్రజలతో ఆరా తీశారు. నేమకల్లులో చేపట్టిన అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. రూ.2.10 కోట్ల వ్యయంతో 50 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకూ 32 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, పీఆర్ జేఈఈ జగదీష్, పంచాయతీ కార్యదర్శులు శివన్న, పల్లవి, చిన్న యల్లప్ప, రాధాకృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్యుల సమ్మె

అనంతపురం మెడికల్: పీహెచ్‌సీ వైద్యుల సమ్మె కొనసాగుతోంది. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆవరణలో ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. క్లినికల్ పీజీ సీట్లను 30 నుంచి 15 శాతానికి, నాన్ క్లినికల్ సీట్లను 50 నుంచి 30 శాతానికి తగ్గించడంతో పీహెచ్‌సీ వైద్యులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యుల సంఘం నాయకులు మనోజ్, డాక్టర్ సంధ్య, డాక్టర్ శివసాయి, డాక్టర్ ఆసియా, డాక్టర్ ప్రీతి, డాక్టర్ పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయం

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ



కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, మేయర్ వసీం

అనంతపురం రూరల్: వాల్మీకి మహర్షి జీవితం నేటి సమాజానికి ఆదర్శ ప్రాయమని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం అనంతపురం పాతూరులోని పవర్ ఆఫీస్ వద్ద ఉన్న వాల్మీకి విగ్రహానికి వారు పూలమాలలు వేసి, నీరాజనాలు సమర్పించారు. అనంతరం స్థానిక వాల్మీక కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. రామాయణాన్ని మహా అద్భుత కావ్యంగా మలచి మానవ జాతిని సన్మార్గంలో నడిపిన మహోన్నత వ్యక్తి వాల్మీకి మహర్షి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం, డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరా, బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహానికి నివాళులు

పాతూరు పవర్ ఆఫీస్ వద్ద ఉన్న వాల్మీకి విగ్రహానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జేసీ శివ్‌నారాయణ్‌శర్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోయ, వాల్మీకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

18న పాఠశాల స్థాయి జేవీవీ చెకుముకి సంబరాలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ నెల 18న పాఠశాల స్థాయిలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సంబరాలు నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీర్రాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు చేతుల మీదుగా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 35 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులతో ఈ సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్వహించే పరీక్షలు తర్వాత అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటున్న కార్యక్రమం ఇదేనన్నారు. ఈ ఏడాదిలో రాష్ట్రంలో దాదాపు 4.50 లక్షలకు పైగా విద్యార్థులు పాల్గొంటుండగా జిల్లా తరఫున 25 వేల మందికి పైగా ప్రాతినిధ్యం వహించే అవకాశముందన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు మాత్రమే ఇందులో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన వారు మండల స్థాయిలో జరిగే పరీక్షలకు, అక్కడ ఎంపికైన వారు జిల్లా స్థాయి, అక్కడి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమణయ్య, కోటేశ్వరప్ప, జేవీవీ నగర కార్యదర్శి ఎస్.తిరుపాల్, కోశాధికారి ఎం.రామిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

అనంతపురం సిటీ: స్థానిక ఆర్డీటీ స్టేడియం సమీపంలో ఉన్న ఎకాలజీ సెంటర్‌లో పంచాయతీ కార్యదర్శులకు బుధవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్య మంగళవారం తెలిపారు. ఒక్కో మండలం నుంచి ఒక్కో కార్యదర్శి శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు (మూడు రోజుల పాటు) శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. శిక్షణ తరగతులను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రారంభిస్తారని వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శులు కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు.

పొలాల్లో కేబుల్ అపహరణ

యాడికి: మండలంలోని చందన గ్రామంలో వ్యవసాయ బోరుబావుల మోటార్లకు అనుసంధానం చేసిన విద్యుత్ తీగలను దుండగులు అపహరించారు. గ్రామ సమీపంలో తమకున్న పొలాల్లో రైతులు మల్లేసు, మోహన్ బాబు గౌడ్, ఆది, పరమేశ్వర, లక్ష్మన్న అరటి పంటను సాగుచేశారు. ఐదుగురు రైతుల బోరుబావులకు ఏర్పాటు చేసిన 70 మీటర్ల కేబుల్‌ను సోమవారం రాత్రి దుండగులు కత్తిరించి తీసుకెళ్లారు. మంగళ వారం ఉదయం విషయాన్ని గుర్తించిన రైతులు లబోదిబో మంటూ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేత 'ప్యాపిలి'



విజేత జట్టుకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో వాల్మీకి జయంతి సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా నంద్యాల జిల్లా ప్యాపిలి జట్టు నిలిచింది. మంగళవారం ఉదయం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుంతకల్లు మండలం కదిరిపల్లి, ప్యాపిలి జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఉత్కంఠ పోరులో చివరకు ప్యాపిలి జట్టు గెలుపొందింది. రన్నరప్‌ను కదిరిపల్లి జట్టు కైవసం చేసుకుంది. మూడో స్థానంలో గుంటూరు, నాల్గో స్థానంలో గుత్తి మండలం వన్నేదొడ్డి జట్లు నిలిచాయి. విజేత జట్లను అభినందిస్తూ టీడీపీ నేత గుమ్మనూరు ఈశ్వర్ నగదు పురస్కారాలతో సత్కరించారు.

మృతుడి ఆచూకీ లభ్యం



సుబ్రహ్మణ్యం (ఫైల్)

గుత్తి: స్థానిక జీఆర్పీ పరిధిలోని తురకపల్లి సమీపంలో సోమవారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. మృతుడిని గుత్తిలోని బండగేరికి చెందిన చాకలి సుబ్రహ్మణ్యం (35)గా గుర్తించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

యాడికి: జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో చోటు చేసుకున్న ప్రమాదంలో యాడికి వాసి శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబపోషణకు ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న శ్రీనివాసులు సోమవారం సాయంత్రం అనంతపురానికి వెళ్లాడు. ప్రింటింగ్ ప్రెస్‌కు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసి బస్టాండ్‌కు నడుచుకుంటూ వెళుతుండగా శరవేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ఘటనలో శ్రీనివాసులు కాలికి తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు.

డీఐఓ డాక్టర్ యుగంధర్‌కు పదోన్నతి



అనంతపురం మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో డీఐఓగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ యుగంధర్‌కు పదోన్నతి దక్కింది. మచిలీపట్నం డీఎంహెచ్‌ఓగా ఆయనను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయనకు డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఉద్యోగులు అభినందించారు.

అరటిలో యాజమాన్యంపై శిక్షణ



కూచివారిపల్లిలో అరటి పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

యల్లనూరు: అరటి, చీనీ పంటలను ఆశించే చీడపీడల నివారణకు సరైన చర్యలు తీసుకుంటే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని ఉద్యాన సంయుక్త సంచాలకులు దేవమునిరెడ్డి అన్నారు. 'ఉద్యాన పంటలకు తెగుళ్లు' శీర్షికన గత నెల 29న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈ క్రమంలో యల్లనూరు మండలం వేములపల్లి, కూచివారిపల్లి గ్రామాల్లో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి, అరటి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. అంతకు ముందు మండలంలో చీనీ, అరటి తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి ఉమాదేవి, నార్పల ఉద్యాన అధికారి నెట్టికంటయ్య, హెచ్‌ఈఓ రామాంజనేయులు, వీహెచ్‌ఏలు మురళి, ప్రవీణ్, మస్తాన్, ఆయేషా, రైతులు పాల్గొన్నారు.

వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్ స్కోరర్‌గా తాడిపత్రి వాసి



వినయ్

తాడిపత్రి టౌన్: ఐసీసీ ఉమెన్స్ వరల్డ్ కప్ - 2025 టోర్నీ స్కోరర్‌గా తాడిపత్రికి చెందిన వినయ్ ఎంపికయ్యాడు. ఈ నెల 9 నుంచి 26వ తేదీ వరకూ విశాఖపట్నంలో ఐసీసీ ఉమెన్స్ వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లలో ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు వినయ్ స్కోరర్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి భీమలింగారెడ్డి మంగళవారం వెల్లడించారు. వినయ్ ఎంపికపై జిల్లా అంపైర్ అసోసియేషన్ సెక్రటరీ అన్సర్‌ఖాన్, ఆర్డీటీ కోచ్ యుగంధర్, తాడిపత్రి క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సాదిక్‌వలి, తాడిపత్రి ఆర్డీటీ సబ్‌సెంటర్ కోచ్ భార్గవ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రెవెన్యూ క్రీడలను విజయవంతం చేయండి

- ఆయా శాఖలు సహకారం అందించాలి
- అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో డీఆర్‌ఓ మలోల, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్: జిల్లాలో నవంబరు 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక-2025 ఉత్సవాలను విజయవంతం చేయాలని, ఇందుకు ఆయా శాఖలు పూర్తి సహకారం అందించాలని జిల్లా అధికారులను అనంతపురం కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. రెవెన్యూ క్రీడల నిర్వహణ అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్‌ఓ ఎ.మలోల, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు మూడు రోజుల పాటు స్థానిక ఆర్డీటీ స్టేడియంలో జరగనున్నాయన్నారు. క్రీడలు సజావుగా నిర్వహించేందుకు ఆయా శాఖలు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. ఏర్పాట్లలో ఏవైనా సమస్యలు ఉంటే డీఆర్‌ఓతో చర్చించి పరిష్కారం పొందాలన్నారు. క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చే ఉద్యోగులకు వసతి, రవాణా సదుపాయం కల్పించాలన్నారు. మూడు రోజుల పాటు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. రోజూ పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్, డీపీఓకు సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఫస్ట్ ఎయిడ్స్ కిట్లు, 108 అంబులెన్స్, ఓఆర్‌ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓని ఆదేశించారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడా ఉత్సవాల్లో 27 యూనిట్లు పాల్గొంటాయన్నారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీసీఎల్‌ఏ, ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. సమావేశంలో ఎఫ్ఎస్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ రాజేష్, ఆర్‌డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునరెడ్డి, రమేష్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, డీపీఓ నాగరాజు నాయుడు, ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, గనుల శాఖ డీడీ ఆదినారాయణ, , రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దివాకర్‌రావు, సోమశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా చింతల రాయుడి కల్యాణం



రథంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు



రథోత్సవంలో కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు



కళాకారుల సందడి

తాడిపత్రి రూరల్: స్థానిక చింతల వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా ఆర్యవైశ్య సంఘం తరఫున మంగళ వాయిద్యాలతో పట్టు వస్త్రాలను ఆలయానికి చేర్చారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వేదికపైకి చేర్చి ప్రధాన అర్చకుడు మురళీస్వామి ఆధ్వర్యంలో ఆశ్వయుజ పౌర్ణమి ఘడియల్లో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథోత్సవం ప్రారంభమైన కొద్దిసేపటికే చిరుజల్లులు పడ్డాయి. దీంతో భక్తులు పరవశించిపోయారు. రథం ముందు వందన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారుల కోలాటం అకట్టుకుంది. వివిధ వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు.

పొట్ట కొట్టేందుకు నిబంధనల కత్తి!

- సర్వజనాస్పత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికుల్లో కలవరం
- నూతన కాంట్రాక్టు సంస్థ నిబంధనలతో భయంభయం
- ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారినీ సాగనంపేందుకు సర్వం సిద్ధం



వేతనాలు విడుదల చేయాలంటూ ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు (ఫైల్)

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది పొట్ట కొట్టేందుకు రంగం సిద్ధమైంది. సర్వజనాస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నూతన శానిటేషన్ కాంట్రాక్టర్ నిబంధనల పేరుతో ఏళ్ల తరబడిగా పని చేస్తున్న కార్మికులను రోడ్డుపాలు చేయనున్నట్లు సమాచారం. 50 ఏళ్లు పైబడిన వారిని తీసుకోమని, అదేవిధంగా కనీసం 8వ తరగతి చదివి ఉంటేనే పారిశుధ్య కార్మికులుగా కొనసాగుతారని నూతన పద్మావతి శానిటేషన్ నిర్వాహకులు చెప్పడంతో కార్మికుల్లో ఆందోళన మొదలైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక శానిటేషన్ కాంట్రాక్ట్‌ను తమ అనుయాయులకు కేటాయించారు. దీంతో పాటు కాంట్రాక్ట్‌లో ప్రత్యేక నిబంధనలు తీసుకువచ్చి పోస్టులకు అమ్ముకునే ప్రయత్నానికి తెరలేపినట్లు తెలుస్తోంది.

సొమ్ము చేసుకునేందుకే..

ఏళ్ల తరబడిగా ప్రభుత్వ సర్వజనాస్పత్రి, వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికులు సేవలందిస్తున్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు సైతం తెగించి రోగులకు సపర్యలు చేసి త్వరగా కోలుకోవడానికి వారు చేసిన కృషి మరువలేనిది. నెలలు తరబడి జీతాలు రాకున్నా ఏదో రోజు వేతనాలు పడతాయి..సమస్యలు సద్దుమణుగుతాయంటూ ఆశతో నెట్టుకొచ్చే కార్మికుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. సర్వజనాస్పత్రిలో 120, వైద్య కళాశాలలో 58, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 33 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో 50 ఏళ్లు దాటిన వారు, 8వ తరగతి చదువుకున్న వారిని పరిశీలిస్తే 99 శాతం ఇంటికెళ్లాల్సిందే. తమ అనుయాయులకు పోస్టులను కట్టబెట్టి రూ.లక్షల్లో సొమ్ము చేసుకునేందుకు ఇలా చేస్తున్నారనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రిన్సిపాల్‌ను కలిసిన ఏఐటీయూసీ నేత..

పారిశుధ్య కార్మికులను తొలగిస్తే ఆందోళన కార్యక్రమాలకు వెనుకాడబోమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీకి ఈ మేరకు వినతి పత్రం అందించారు. డీఎంఈ దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి


మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం అర్బన్ లేఅవుట్లలోని ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థలో సంబంధిత అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమై ఇళ్ల పురోగతిపై చర్చించారు. అర్బన్ లేఅవుట్లలో పూర్తయిన 2,521 ఇళ్లలో ఆప్షన్ 3 నుంచి ఆప్షన్ 1,2 లోకి మార్చుకునేందుకు అడిషినల్ ఫైనాన్స్ అసిస్టెన్స్ ఎస్సీ, బీసీలకు రూ.50,000, ఎస్టీలకు రూ.70,000 మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ డబ్బును ఆప్షన్ 1, 2 లబ్ధిదారులకు మాత్రమే జమ చేస్తామన్నారు. గతేడాది డిసెంబర్ 10 నుంచి పూర్తయిన ఇళ్లకు ఆప్షన్ 3 నుంచి ఆప్షన్ 1,2 లోకి మార్చేందుకు లబ్ధిదారుల అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్, హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ, అసిస్టెంట్ ఇంజినీర్లు శివారెడ్డి, జమీల్ అహ్మద్, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆ న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి


జిల్లా కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అనంతపురం టవర్‌క్లాక్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్‌కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అనంతరం న్యాయవాది రాకేష్ కిశోర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో సుగమంచి శ్రీనివాసులు, రామకృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

బాధాకరం..

అనంతపురం కల్చరల్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి యత్నించడం బాధాకరమని జిరసం (జిల్లా రచయితల సంఘం) పేర్కొంది. ఈ మేరకు మంగళవారం సంస్థ గౌరవాధ్యక్షులు డాక్టర్ జెన్నే ఆనంద్‌కుమార్, అధ్యక్షులు కొత్తపల్లి సురేష్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి దుశ్చర్యను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని కోరారు. పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

న్యాయవాదుల నిరసన

అనంతపురం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి హేయమని న్యాయవాదులు పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతపురం బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఈ. వెంకట్రాముడు, స్పోర్ట్స్ సెక్రటరీ విజయభాస్కర్, ఐలు అధ్యక్ష, కార్యదర్శులు వీరమాసప్ప, సతీష్ మాట్లాడుతూ.. అత్యున్నత న్యాయస్థానంలో ఉండే ప్రధాన న్యాయమూర్తిపైనే దాడి జరిగితే సాధారణ ప్రజలకు ఏమి రక్షణ ఉంటుందన్నారు. ఈ దాడితో యావత్తు దేశం దిగ్భ్రాంతికి లోనైందన్నారు. కార్యక్రమంలో ఐలు ఉపాధ్యక్షులు మల్లేష్ గౌడ్, జీసీ ప్రకాష్, పురుషోత్తం, అశోక్, గిరీష్, లక్ష్మణ్, భరత్, సీనియర్ అడ్వకేట్ నాగేంద్ర పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై సర్కారు చిన్నచూపు

అనంతపురం కార్పొరేషన్: సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు వివిధ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నా న్యాయబద్ధంగా రావాల్సిన ప్రయోజనాలను ప్రభుత్వం అందించడం లేదని సచివాలయ ఉద్యోగుల జేఏసీ నేతలు వాపోయారు. సమ్మె నోటీసులో భాగంగా మంగళవారం నగరపాలక సంస్థలో ప్లకార్డులను ప్రదర్శించి ధర్నా చేపట్టారు. అనంతరం కమిషనర్ బాలస్వామికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు సీనియారిటీ జాబితా ప్రకటించాలన్నారు. మూడు నోషనల్ ఇంక్రిమెంట్లు, తొమ్మిది నెలల అరియర్స్, ఆరేళ్ల సర్వీసు పూర్తయిన వారికి ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం లీవ్స్ మంజూరు, ఈఎల్‌లు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు లక్ష్మీనారాయణ, వరప్రసాద్, చంద్ర, మల్లికార్జున, రామకృష్ణ, మల్లన్న, లక్ష్మీకాంత్, శ్రీనాథ్ నాగిరెడ్డి, రమేష్, గురుబ్రహ్మ, విమల, దిల్షాద్, తదితరులు పాల్గొన్నారు.

స్టాప్ ఉంది.. బస్సే నిలవదు!

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో బస్టాప్ ఉంది. ప్రయాణికులు చేయి ఎత్తితే అన్ని రకాల బస్సులు ఆపాల్సిందే. మహిళలు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసిన తర్వాత సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు కాదు కదా కనీసం 'పల్లె వెలుగు' బస్సులు కూడా ఆపకుండా వెళ్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇదిలాఉండగా స్లో చేస్తే ప్రయాణికులు ఎక్కుతారనే ఉద్దేశంతో చాలామంది డ్రైవర్లు ఇక్కడ ఏర్పాటు చేసిన పెద్ద స్పీడ్ బ్రేకర్‌ను సైతం ఎగిరించుకుంటూ పోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఉదయం పూట ప్రయాణించే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం పట్టించుకోలేదని వాపోతున్నారు. మంగళవారం జరిగిన ఓ ఘటన ఇక్కడి సమస్యకు అద్దం పడుతోంది.

ఏమి జరిగిందంటే...

ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో కళ్యాణదుర్గం వెళ్తున్న పల్లెవెలుగు బస్సు వచ్చింది. అప్పటికే రెండు బస్సులు నిలబెట్టకపోవడంతో ఆత్మకూరు వైపు వెళ్లేందుకు ఎదురు చూస్తున్న ఓ ఉద్యోగి డ్యూటీకి టైం అయిపోతుందనే ఆందోళనలో ఉన్నాడు. చేయి ఎత్తినా వచ్చిన పల్లె వెలుగు బస్సు కూడా ఆపకుండా వెళ్తుండడాన్ని పసిగట్టి రోడ్డు మధ్యలోకి వెళ్లాడు. దీంతో డ్రైవరు బస్సును కాస్తా స్లో చేశాడు...ఆ ఉద్యోగి బస్సు ఎక్కకనే స్పీడు పెంచాడు. దీంతో అదుపుతప్పి ఆ ఉద్యోగి కింద రోడ్డ మీదకు పడిపోయాడు. అదృష్టవశాత్తూ వెనుక వైపు నుంచి వాహనాలు రాలేదు. ఏదైనా పెద్ద వాహనం వచ్చి ఉంటే ప్రమాదం తీవ్రత ఊహించలేమని ప్రత్యక్ష సాక్షులు వాపోయారు. ఈ ఘటనతో డ్రైవరు బస్సును ఆపాడు. కిందకు పడిన ఉద్యోగి బస్సు వద్దకు వచ్చి డ్రైవరును కిందకు దింపి చివాట్లు పెట్టాడు. బస్టాప్ వద్ద ప్రయాణికులు చేయి ఎత్తితే నిలబట్టాలనే ఇంగిత జ్ఞానం లేదా.. ఇంటినుంచి త్వరగా బయటకు వచ్చినా మీలాంటి వారి నిర్వాకంతో వేళకు డ్యూటీలకు వెళ్లలేకపోతున్నామని మండిపడ్డాడు. ఉద్యోగికి బస్సులో ఉన్న ప్రయాణికులు తోడయ్యారు. డ్రైవరు అలసత్వం పట్ల వారు కూడా మండిపడ్డారు. 'మీకేమైనా ఇబ్బంది ఉంటే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలి కానీ రోడ్లపై ప్రయాణికులను ఎలా ఇబ్బంది పెడతార'ని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది. పలువురు కల్పించుకుని సర్దిచెప్పారు.

ప్రభుత్వంపై 'ఫ్యాప్టో' పోరుబాట విజయవంతం


పోరుబాటలో జిల్లా ఫ్యాప్టో నాయకులు, టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్ : విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) మంగళవారం విజయవాడలో తలపెట్టిన పోరుబాట విజయవంతమైంది. అనంతపురం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఫ్యాప్టో నేతలు, ఉపాధ్యాయులు తరలివెళ్లారు. ధర్నాను భారీ స్థాయిలో విజయవంతం చేసిన ఉద్యమకారులకు, సెలవు పెట్టి ధర్నాకు సంఘీభావాన్ని తెలియజేసిన జిల్లాలోని ఉపాధ్యాయ మిత్రులకు ఫ్యాప్టో అనంతపురం జిల్లా శాఖ పక్షాన చైర్మన్ ఆర్.శ్రీనివాస నాయక్, సెక్రటరీ జనరల్ బి.పురుషోత్తం వందనాలు తెలియజేశారు.

పని గంటల పెంపు దుర్మార్గం

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం కార్మిక ద్రోహానికి ఒడిగడుతూ పనిగంటలు పెంపు నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ ధ్వజమెత్తారు. సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులకు తక్కువ వేతనాలిస్తూ ఎక్కువ సమయం పనిచేయించుకుని శ్రమదోపిడీకి పాల్పడడం క్రూరమైన విధానమంటూ మండిపడ్డారు. అసెంబ్లీలో ఐదు గంటలు ఓపికగా కూర్చోలేని పాలక వర్గాలు సంపద సృష్టించే శ్రామిక వర్గం మాత్రం 10 గంటలు, 12 గంటలు, 13 గంటలకు పనిచేయాలంటూ కార్మిక చట్టాలను సవరించాలని చూడడం అన్యాయమన్నారు. సంఘాల నాయకులు కృష్ణమూర్తి, బాలరంగయ్య, శ్రీనివాసులు, ఆజాంబాషా, ఆది, స్వాతి, ఎర్రిస్వామి, లక్ష్మినరసమ్మ పాల్గొన్నారు.

'మన డబ్బులు - మన లెక్కలు'పై శిక్షణ

రాప్తాడు: మహిళా సంఘాల్లోని సభ్యుల పొదుపు, రుణ వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన డబ్బులు - మన లెక్కలు' యాప్‌పై మంగళవారం మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీలో 16 మండలాల ఏపీఎంలు, ఎల్సీ, సీసీలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీడీ రాధారాణి, డీపీఎం ఐబీ రాజ్యలక్ష్మీ, డీపీఎం హెచ్‌ఆర్ సత్యనారాయణ, ఏపీ ఎంఐబీ భాస్కర నాయుడు, ఏపీఎం ఉన్నతి మంజుల తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాలికల ప్రత్యేక ఆధార్ శిబిరాలు

అనంతపురం సిటీ: జాతీయ తపాలా వారోత్సవాలను పురస్కరించుకొని బాలికల కోసం ప్రత్యేక ఆధార్ బయోమెట్రిక్ శిబిరాలను బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు అనంతపురం డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ అమరనాథ్ మంగళవారం తెలిపారు. ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు నిర్దేశిత ప్రదేశాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కొవ్వూరునగర్‌లోని విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఈ నెల 8 నుంచి 9వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరం ఉంటుందన్నారు. కళ్యాణదుర్గం రోడ్డులోని నవభారత్ స్కూల్‌లో ఈ నెల 10 నుంచి 11వ తేదీ వరకు, పాపంపేటలోని భాగ్యనగర్‌లో గల ఎస్.ఎఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 13, 14 తేదీల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బాలికల ఆధార్ నమోదుచ బయోమెట్రిక్, అప్‌డేట్ సేవలు అందించనున్నట్లు ప్రకటించారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత


చెక్కు అందజేస్తున్న పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

రాప్తాడురూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న పాస్టర్ మైఖేల్ భార్య వైద్య ఖర్చుల నిమిత్తం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు ఆదేశాల మేరకు సెక్రటరీ పాస్టర్ జీఆర్ ఆనంద్, జాయింట్ సెక్రెటరీ పాస్టర్. వి. మనష్షే, ఈసీ మెంబర్స్ పాస్టర్ విజయ్ సింహ, పాస్టర్ చార్లెస్ నాయక్, పాస్టర్ లాబాను సుధాకర్, పాస్టర్ శ్యాం సుందర్ మంగళవారం అనంతపురం నగరంలో మైఖేల్ భార్య చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి అసోసియేషన్ తరపున రూ. 14,400 ఆర్థిక సాయం అందించారు.

విద్యార్థి అదృశ్యం


గోపీచంద్

అనంతపురం: నగరంలోని సాయినగర్ ఒకటో క్రాస్‌లో ఉన్న రామన్‌స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న పి. గోపీచంద్ (14) అనే విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన పి. చంద్రశేఖర్ కుమారుడు పి. గోపీచంద్ మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనానికి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. స్కూల్ యూనిఫాంలో ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబర్ 9440796806కు సమాచారం ఇవ్వాలని టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ కోరారు.

వాల్మీకి రామాయణం మార్గదర్శకం


మాట్లాడుతున్న ఎస్కేయూ రెక్టార్ వెంకటనాయుడు


జేఎన్‌టీయూలో వాల్మీకి జయంతి

అనంతపురం: వాల్మీకి రామాయణం మార్గదర్శకమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు అన్నారు. మంగళవారం ఎస్కేయూలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాల్మీకి రామాయణం పఠనం ద్వారా యువత సనాతన ధర్మం, తెలుగు భాష వైభవం తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. ఆంజనేయులు, సీనియర్ ప్రొఫెసర్ జీవీ రమణ తదితరులు వాల్మీకి రామాయణం విశిష్టతను వివరించారు.

- జేఎన్‌టీయూ పాలకభవనంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఓ. దేవన్న, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మహానుభావుడు వాల్మీకి

రాప్తాడు: మానవాళికి రామాయణం లాంటి మహత్తర గ్రంథాన్ని అందించిన మహానుభావుడు వాల్మీకి మహర్షి అని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు కొనియాడారు. మంగళవారం రాప్తాడులో వాల్మీకి సంఘం నాయకులు వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక వాహనంలో వాల్మీకి మహర్షి విగ్రహం ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపును డీఎస్పీ వెంకటేశులు, సీఐ శ్రీహర్ష ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, సాకే జయన్న, సత్యనారాయణ, ఎస్‌జేఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత సాకే జయరాముడు, అనిల్ కుమార్, తలారి లక్ష్మీనారాయణ, తలారి శివ, బోయ రాము, రామకృష్ణ, నాగప్ప, ట్రాక్టర్ కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో మంగళవారం వాల్మీకి సోదరులు భక్తి శ్రద్ధలతో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి విగ్రహం వద్ద టెంకాయలు కొట్టారు.

కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన ఎల్లార్జీ

రాప్తాడు: తెలంగాణలోని శంకరపల్లిలో జరిగిన దక్షిణ భారత కరాటే పోటీల్లో మండలంలోని ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ బోంతు ప్రసాద్, శిక్షకుడు, ఇంటర్‌నేషనల్ ప్లేయర్ సెన్సాయి మంజునాథ ఆచారి పేర్కొన్నారు. మంగళవారం గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. ప్రిన్సిపాల్ బోంతు ప్రసాద్ మాట్లాడుతూ తొలి దక్షిణ భారత కరాటే డీఎంఏ కప్-2025 పోటీల్లో జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. అద్భుతమైన ప్రదర్శనతో 20 మంది క్రీడాకారులు గోల్డ్‌మెడల్స్ సాధించారన్నారు. కటాస్ విభాగంలో 12 పతకాలు, కుమితి విభాగంలో 8 వచ్చాయన్నారు. ఎల్లార్జీ పాఠశాల విద్యార్థులు తనుశ్రీ, వినిత రాయన్, చార్విన్, లక్ష్మీ నివేది, నేహ, గీతిక, కుందన్ గోల్డ్‌మెడల్ సాధించిన వారిలో ఉన్నారన్నారు.

జగనన్నను కలిసిన జిల్లా నేతలు



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌తో కాగజ్‌ఘర్ రిజ్వాన్, సాకే చంద్రశేఖర్

అనంతపురం కార్పొరేషన్: తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని జిల్లా నేతలు కలిశారు. జగనన్నను కలిసిన వారిలో మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఉన్నారు. పార్టీ పటిష్టత కోసం క్షేత్రస్థాయిలో చురుగ్గా పని చేయాలని నాయకులకు అధినేత వైఎస్ జగన్ ఆదేశించారు.

జగతికి ఆదర్శప్రాయుడు వాల్మీకి


వాల్మీకి మహర్షి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: వాల్మీకి మహర్షి జగతికి ఆదర్శప్రాయుడని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాప్తాడులో వాల్మీకి జయంతిని పురస్కరించుకుని వాల్మీకి మహర్షి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు రుషులవుతారని చాటి చెప్పి, రామాయణం వంటి సుందరమైన కావ్యాన్ని రచించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ రాముని విధానం అనుసరించాలన్నారు. వాల్మీకి మహర్షి ఆశీస్సులు రాప్తాడు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జూటూరు లక్ష్మన్న, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, నాయకులు జయన్న పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

అనంతపురం: బుక్కరాయసముద్రం మండలం కేంద్రం చాపల రాముల కాలనీకి చెందిన చాకలి కేశన్నపై గత నెల 30న హత్యాయత్నం జరిగిన సంగతి విదితమే. కేశన్న అల్లుడు చాకలి సుబ్బారావు తన జల్సాలకు అడిగినంత డబ్బు ఇవ్వలేదనే కోపంతో కేశన్నపై కక్ష పెంచుకున్నాడు. హత్య చేసి పగ తీర్చుకోవాలనే ఉద్దేశంతో స్థానిక జంగాలపల్లి మసీదుకు ఎదురుగా ఉన్న రియల్‌ఎస్టేట్ ఆఫీసులో చాకలి కేశన్నపై కొడవలితో దాడి చేశాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న చాకలి సుబ్బారావును మంగళవారం కదిరి-అనంతపురం రోడ్డులోని వనమిత్ర పార్కు వద్ద అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అతని వద్ద నుంచి పిడిబాకును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

రాప్తాడురూరల్: ప్రైవేట్ బస్సు ఢీ కొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం అనంతపురం రూరల్ పంగల్ రోడ్డు సమీపంలో చోటు చేసుకుంది. ఇటుకలపల్లి పోలీసులు తెలిపిన మేరకు...ఎకాలజీ సెంటర్‌లో పని చేస్తున్న నాగరాజు ద్విచక్రవాహనంలో ఎస్కేయూ వైపు వెళ్తున్నాడు. వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ బస్సు పంగల్‌రోడ్డు దాటిన తర్వాత అదుపుతప్పి నాగరాజు బైకును బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ నాగరాజును హుటాహుటిన సర్వజన ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతం

అనంతపురం కల్చరల్: ఆశ్వీజమాస పౌర్ణమి రాకతో మంగళవారం పలుచోట్ల సత్యదేవుని వ్రతాలు ఘనంగా జరిగాయి. మూడో రోడ్డు షిరిడీ సాయిబాబా మందిరంలో ఉదయం శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి వ్రతాన్ని అర్చక బృందాలు అన్నవరం సంప్రదాయ రీతిలో జరిపించారు. సత్యదేవుని ఐతిహ్యంలోని విశేషంగా కనపడే ఐదు వ్రత కథలను సమగ్రంగా వివరించారు. భక్తులకు సత్యనారాయణ స్వామి ప్రసాదం అందించారు. అంతకుముందు షిరిడీ సాయినాథుడికి ప్రత్యేక అలంకార సేవలు, పూజలు జరిగాయి. అశోక్‌నగర్ సత్యనారాయణస్వామి ఆలయం, వేమనా టెలీఫోన్ భవన్ ఎదురుగా ఉన్న బాబా మందిరం, సత్యదేవనగర్‌లోని సత్యనారాయణస్వామి ఆలయాల్లోనూ వ్రతాలు జరిగాయి.

రేపటి నుంచి మహిళా సమస్యలపై ఫొటో ఎగ్జిబిషన్

అనంతపురం అర్బన్: ఐద్వా రాష్ట్ర మహాసభలు ఈనెల 13 నుంచి జరగనున్న నేపథ్యంలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు మహిళా సమస్యలపై ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రి తెలిపారు. మంగళవారం స్థానిక స్నేహలత నర్సింగ్ హోమ్‌లో ఎగ్జిబిషన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ స్థానిక కృష్ణకళామందిర్‌లో మహిళల సమస్యలపై వివిధ రూపాల్లో ఉన్న ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.అరుణ, డాక్టర్ ఎం. ప్రగతి పాల్గొంటారన్నారు. ఎగ్జిబిషన్‌ను అందరూ తిలకించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసూన, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, నగర కార్యదర్శి అశ్విని, నాయకురాళ్లు రామాంజినమ్మ పాల్గొన్నారు.

సమాజ పురోగతిలో జర్నలిస్టుల పాత్ర కీలకం


రమేష్ గౌడ్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టులు

అనంతపురం: సమాజ పురోగతిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్ అన్నారు. మూడు రోజులుగా అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జేశాప్) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగిన పోటీలకు రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం వేదికగా జేశాప్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తుండడం గర్వకారణమన్నారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే జర్నలిస్టులకు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జేశాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు జగదీష్, ఎం. ప్రసాద్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం

అనంతపురం కల్చరల్: శివబాలయోగి ఆశ్రమంలో ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా వివిధ దేవతామూర్తుల కల్యాణోత్సవాలు సాగుతున్నాయి. లోక కల్యాణం కోసం సాగుతున్న వేడుకల్లో భాగంగా మంగళవారం శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల హోరు, సుబ్రహ్మణ్యేశ్వర పాహిమాం అన్న భక్తుల నామస్మరణ నడుమ కల్యాణోత్సవం సాగింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థిని


విద్యార్థిని సంధ్య

ఆత్మకూరు: కేజీబీవీలో ఇంటర్ చదువుతున్న సంధ్య రాష్ట్రస్థాయి హై జంప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ లీమా రోజ్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా అండర్ 19 విభాగంలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు.

సునీత వ్యాఖ్యలు జుగుప్సాకరం

- ఆత్మకూరు ఎంపీపీ హేమలత మండిపాటు

ఆత్మకూరు: 'పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగలేదు. ఎమ్మెల్యే పరిటాల సునీత, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నిర్మాణాలు జరగకుండా అడ్డు పడ్డారు. ఇళ్ల గురించి మాట్లాడితే చెప్పు తెగుద్ది అని పరిటాల సునీత మాట్లాడటం.. ఆమె అహంకార ధోరణికి నిదర్శనం' ఆత్మకూరు ఎంపీపీ హేమలత మండిపడ్డారు. మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓట్లు వేసిన ప్రజలకు బాధ్యతగా పనిచేయాలని, అలా కాకుండా జుగుప్స కలిగించే విధంగా వ్యాఖ్యానించడం తగదని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్నా 'ఆడబిడ్డ నిధి' పథకం అమలు ఏమైందని ప్రశ్నించారు. కమీషన్ల కోసం ఆరాటపడకుండా.. ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాల పూర్తికి సహకరించాలని హితవు పలికారు.